పన్ను వసూలు 21 శాతమే..

- మిర్యాలగూడ మున్సిపాలిటీలో ఆస్తిపన్ను లక్ష్యం.. రూ.25.55 కోట్లు
- ఇప్పటి వరకు వసూలైంది రూ.5.45 కోట్లు
- భారీగా పేరుకుపోయిన బకాయిలు

మిర్యాలగూడ టౌన్: మున్సిపాలిటీలో ఆస్తిపన్ను వసూలు నత్తనడకన సాగుతోంది. ఇప్పటివరకు 21.34శాతం వరకు మాత్రమే వసూలు చేశారు. కొద్దిరోజుల్లో ఆర్థిక సంవత్సరం ముగియనుంది. మున్సిపాలిటీలో 2024–2025 ఆర్థిక సంవత్సరానికి గాను ఎరియర్స్, ప్రస్తుత ఆస్తి పన్నులతో పాటు మొండి బకాయిలు కలుపుకొని మొత్తం రూ.25.55కోట్లు వసూలు చేయాల్సి ఉంది. ఈనెల 28 నాటికి రూ.5.45 కోట్లు మాత్రమే వసూలు చేశారు. ఇంకా రూ.20 కోట్ల 10 లక్షల 54 వేలు మార్చి 31వరకు వసూలు చేయాల్సి ఉంది.

నోటీసులు జారీ చేసినా..

మిర్యాలగూడ మున్సిపాలిటీలో 48 వార్డులుండగా 25,653 అసెస్‌మెంట్లు ఉన్నాయి. వీటిలో రెసిడెన్షియల్, నాన్ రెసిడెన్షియల్, కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వ రంగ సంస్థలున్నాయి. ప్రస్తుతం 100 మంది వరకు బకాయిలు ఉండగా వీరిలో టాప్ టెన్‌లో 10 మంది వరకు మొండి బకాయిలు ఉన్నవారికి ఇప్పటికే రెడ్ నోటీసులు జారీ చేసినా వారి నుంచి ఎలాంటి స్పందన లేదు. ప్రభుత్వ రంగ సంస్థలతో కలిసి మొత్తం 25,653 వరకు అసైస్‌మెంట్‌లు ఉండగా.. వీటిలో సెంట్రల్ గవర్నమెంట్ భవనాలు 155, రాష్ట్ర ప్రభుత్వ భవనాలు 389 ఉన్నాయి. అయితే ప్రభుత్వ రంగ శాఖల నుంచి ఆస్తి పన్నులు విడుదల కాకపోవడంతో బకాయిలు మరింత పెరిగిపోతున్నాయి.



నిధులు సరిపోకపోవడంతో..

పారిశుద్ధ్యం, ఇందనం, వాహనాల మరమ్మతులు, ఔట్ సోర్సింగ్ కార్మికుల వేతనాలు, వీధి దీపాలు, తాగునీటి సరఫరాకు ప్రధాన ఆదాయ వనరులు ఆస్తి పన్నుల నిధులు సరిపోవడం లేదు. బడ్జెట్‌లో రెట్టింపుతో సొంత ఆదాయాన్ని సమకూర్తుందని అంచనాలు రూపొందించినా... వాస్తవానికి వస్తే ప్రతి నెలా సర్దుబాటు ప్రయత్నాలే కనిపిస్తున్నాయి. లోటు బడ్జెట్ స్పష్టంగా కనిపిస్తోంది. ప్రతి సంవత్సరం ప్రభుత్వ సంస్థల నుంచి బకాయిలు భారీగానే వసూలు చేస్తామని చెబుతున్న మున్సిపల్, రెవెన్యూ సిబ్బంది నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారని పలువురు ఆరోపిస్తున్నారు.

పన్ను చెల్లించి అభివృద్ధికి సహకరించాలి



మున్సిపాలిటీలో ఆస్తి పన్నులను చెల్లించేందుకు పట్టణ ప్రజలు, ప్రభుత్వ కార్యాలయాల సిబ్బంది సహకరించాలి. ఆస్తి పన్నుల నిధులు రాకపోతే పట్టణంలో అభివృద్ధి పనులు కొంత వరకు కుంటు బడే అవకాశాలున్నాయి. పూర్తి స్థాయిలో బకాయిలు వసూలు చేసే విధంగా అధికారుల సమన్వయంతో ముందుకు వెళ్తున్నాం. ముందస్తు నోటీసులు కూడా జారీ చేస్తున్నాం. మార్చి 31లోగా పూర్తి స్థాయిలో ఆస్తిపన్ను చెల్లించాలి.

– మహ్మద్ యూసుఫ్, మున్సిపల్ కమిషనర్, మిర్యాలగూడ

మొండి బకాయిదారులకు నోటీసులు జారీ



మిర్యాలగూడలోని ఇంజనీరింగ్ కళాశాలకు నోటీసులు జారీ చేస్తున్న తహసీల్దార్ హరిబాబు

మిర్యాలగూడ టౌన్: మిర్యాలగూడ మున్సిపాలిటీలో ఆస్తి పన్ను చెల్లింపులో నిర్లక్ష్యంగా వ్యవహరించిన మొండి బకాయిదారులకు మిర్యాలగూడ సబ్ కలెక్టర్ నారాయణ్ అమిత్ ఆదేశాల మేరకు తహసీల్దార్ హరిబాబు, మున్సిపల్ ఆర్ఓ జ్ఞానేశ్వరి బుధవారం నోటీసులు జారీ చేశారు. మినా ఇంజనీరింగ్ కళాశాలల యాజమాన్యం సుమారు రూ.10లక్షలకుపైగా ఆస్తిపన్ను పెండింగ్‌లో ఉందని తెలిపారు. వంద మందికి పైగా మొండి బకాయిదారులు ఉండగా.. వారిలో అత్యధికంగా రూ.లక్షల్లో బకాయి ఉన్నారని వారికి నోటీసులు జారీ చేస్తున్నట్లు చెప్పారు. ఆస్తి పన్ను వసూళ్లల్లో ఎలాంటి మినహాయింపు ఉండదన్నారు. మార్చి 31 వరకు పూర్తి స్థాయిలో బకాయిలు చెల్లించకుంటే కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు.

పంట నష్టం కలిగించిన వారిపై చర్యలు తీసుకోవాలి

మిర్యాలగూడ: తన పొలంలో అక్రమంగా గడ్డి మందు కొట్టి పంట నష్టం కలిగించిన వారిపై చర్యలు తీసుకోవాలని మిర్యాలగూడ మండలంలోని యాద్గార్‌పల్లి గ్రామానికి చెందిన రైతు మల్లె బోయిన మట్టయ్య బుధవారం పోలీసులను ఆశ్రయించాడు. గ్రామంలోని సర్వే నంబర్ 79లో తనకు వారసత్వంగా 32 గుంటల వ్యవసాయ భూమి ఉందని, కానీ గ్రామానికి చెందిన గువ్వల రామకృష్ణ ఆ భూమి తమదంటూ ఇబ్బందులకు గురి చేస్తున్నాడని వాపోయాడు. దీంతో జూనియర్ సివిల్ కోర్టులో కేసు వేయగా.. కోర్టు ఆదేశానుసారం అందులో సాగు చేసుకున్నానని తెలిపాడు. ఈనెల 19న రామకృష్ణ తన వ్యవసాయ భూమిలో అక్రమంగా ప్రవేశించి గడ్డి మందును పిచికారీ చేస్తున్నాడని స్థానికులు చెప్పగా.. మరుసటి రోజు వెళ్లి చూసేసరికి వరి పంట మొత్తం ఎండిపోయిందని, రూరల్ పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేసినట్లు తెలిపాడు.



ఎండిపోయిన వరి పైరును చూపుతున్న మట్టయ్య

క్లుప్తంగా

ఆర్థికసాయం అందజేత



ఆర్థికసాయం అందజేస్తున్న చేయూత సభ్యులు

డిండి: మండల కేంద్రానికి చెందిన ఎత్తపు ఈదమ్మ బుధవారం అనారోగ్యంతో మృతి చెందింది. డిండి యువత చేయూత ఆధ్వర్యంలో మృతురాలి అంత్యక్రియల ఖర్చుల నిమిత్తం కుటుంబ సభ్యులకు రూ.10 వేలు ఆర్థికసాయంగా అందజేశారు. కార్యక్రమంలో బొల్లే శైలేష్, శ్రీనివాసులు, పున్న దినేష్ తదితరులు పాల్గొన్నారు.

రంగశాయి రెడ్డికి నివాళి



రంగశాయి రెడ్డి చిత్రపటానికి నివాళులర్పిస్తున్న ఎంపీ, ఎమ్మెల్యే

త్రిపురారం: నిడమనూరు మండలంలోని తుమ్మడం గ్రామానికి చెందిన కాంగ్రెస్ రాష్ట్ర నాయకుడు రంగశాయి రెడ్డి ఇటీవల అనారోగ్యంతో మృతిచెందాడు. నల్లగొండ ఎంపీ కుందూరు రఘువీర్ రెడ్డి, సాగర్ ఎమ్మెల్యే కుందూరు జైవీర్‌రెడ్డి బుధవారం రంగశాయి రెడ్డి ఇంటికి వెళ్లి ఆయన చిత్రపటానికి నివాళులర్పించి కుటుంబ సభ్యులను పరామర్శించారు. వారి వెంట డీసీసీ కేతావత్ శంకర్ నాయక్, మార్కెట్ చైర్మన్ సత్యం, అనుముల శ్రీనివాస్ రెడ్డి, ముడిమళ్ల బుచ్చిరెడ్డి, మర్ల చంద్రారెడ్డి, బిట్టు రవి కుమార్ కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు ఉన్నారు.

బాధిత కుటుంబానికి పరామర్శ

తిరుమలగిరి(నాగార్జునసాగర్): మండలంలోని శ్రీరాంపల్లి గ్రామానికి చెందిన ఐత బోయిన లింగమ్మ ఇటీవల అనారోగ్యంతో మృతి చెందింది. విషయం తెలుసుకున్న ఎమ్మెల్యే కుందూరు జైవీర్‌రెడ్డి.. బుధవారం లింగమ్మ నివాసానికి వెళ్లి ఆమె చిత్రపటానికి నివాళులర్పించారు. ఆయన వెంట హాలియా వ్యవసాయ మార్కెట్ చైర్మన్ తుమ్మలపల్లి శేఖర్‌రెడ్డి, వైస్ చైర్మన్ కాంసాని చంద్రశేఖర్ తదితరులున్నారు.

హామీలు అమలు చేయాలి

పెద్దఅడిశర్లపల్లి: ప్రభుత్వం ఎన్నికల్లో దళితులకు ఇచ్చిన హామీలు అమలు చేయాలని కుల వివక్ష వ్యతిరేక పోరాట సంఘం జిల్లా ఉపాధ్యక్షుడు పెరికె విజయ్‌కుమార్ అన్నారు. బుధవారం పెద్దఅడిశర్లపల్లి మండలంలోని అంగడిపేట ఎక్స్ రోడ్ వద్ద ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. రాష్ట్రంలో అధికారంలోకి వచ్చాక డాక్టర్ బీఆర్ అంబేద్కర్ అభయ హస్తం పేరుతో ప్రతి దళిత కుటుంబానికి రూ.12 లక్షలతో పాటు ఇళ్ల స్థలాలు పంపిణీ చేస్తామని హామీ ఇచ్చి నేటికీ అమలు చేయలేదని ఆరోపించారు.

బంగారికుంటతండాలో పశువైద్య శిబిరం

అడవిదేవులపల్లి: మండలంలోని బంగారికుంట తండాలో బుధవారం గోపాలమిత్ర ఆధ్వర్యంలో పశువైద్య శిబిరం నిర్వహించారు. 48 గేదెలకు పలు రకాల వ్యాధులు ఉన్నట్లు గుర్తించి నివారణ చర్యలు చేపట్టారు. 32 దూడలకు నట్టల నివారణ మందులు వేశారు. కార్యక్రమంలో మండల పశువైద్యాధికారి మాలోతు మేఘ్యానాయక్, గోపాలమిత్ర సూపర్‌వైజర్ శివారెడ్డి, గోపాల మిత్రలు దేవిసింగ్‌లతో పాటు రైతులు తదితరులున్నారు.

నిబంధనల ప్రకారమే లబ్ధిదారుల ఎంపిక



కంపాలపల్లిలో సర్వే నిర్వహిస్తున్న ఎంపీడీఓ విజయ కుమారి

త్రిపురారం: ప్రభుత్వ నిబంధనల ప్రకారం అర్హులైన ప్రతి లబ్ధిదారుడిని ఎంపిక చేసి ప్రభుత్వ పథకాలు అందజేస్తామని త్రిపురారం ఎంపీడీఓ విజయ కుమారి తెలిపారు. త్రిపురారం మండలంలో సంక్షేమ పథకాల అమలుకు పైలెట్ ప్రాజెక్ట్‌గా ఎంపిక చేసిన కంపాలపల్లి గ్రామంలో బుధవారం లబ్ధిదారుల ఇంటింటికి వెళ్లి సర్వే నిర్వహించారు.

లబ్ధిదారుల ఎంపికలో పారదర్శకత పాటించాలి



అధికారులకు సూచనలు చేస్తున్న ఎమ్మెల్యే లక్ష్మారెడ్డి

- ఎమ్మెల్యే బత్తుల లక్ష్మారెడ్డి

మిర్యాలగూడ: ప్రభుత్వం అమలు చేసే పథకాలకు లబ్ధిదారుల ఎంపికలో పారదర్శకత పాటించాలని ఎమ్మెల్యే బత్తుల లక్ష్మారెడ్డి అన్నారు. బుధవారం మిర్యాలగూడ పట్టణంలోని ఎంపీడీఓ కార్యాలయంలో పంచాయతీరాజ్, ఉపాధి హామీ అధికారులు, సిబ్బందితో ఏర్పాటు చేసిన సమీక్షా సమావేశంలో ఆయన మాట్లాడారు. గతంలో ఉపాధి హామీ సిబ్బంది తమ విధులు సక్రమంగా నిర్వహించకపోవడంతో 20 రోజుల పనిదినాలు లేక ఆత్మీయ భరోసాకు కూలీలు దూరమయ్యారన్నారు. ఇప్పటి నుంచైనా ఉపాధి హామీ సిబ్బందికి వంద రోజుల పనిదినాలు కల్పించాలని అధికారులకు సూచించారు. ఎంపీడీఓ కార్యాలయ ఆవరణలో ఇందిరమ్మ ఇంటి నమూన నిర్మాణం చేపట్టి 40రోజుల్లో పూర్తి చేయాలన్నారు. పథకాల అమలులో నిర్లక్ష్యం వహించే అధికారులపై చర్యలు తప్పవన్నారు. సమావేశంలో అడిషనల్ పీడీ నవీన్‌కుమార్, ఏపీడీ బాలకృష్ణ, జిల్లా విజిలెన్స్ అధికారి వేణుగోపాల్ రావు, ఎంపీడీఓ శేషగిరిశర్మ, పంచాయతీరాజ్ ఈడీ ఆదినారాయణ, ఎస్ఆర్పీలు, పంచాయతీ కార్యదర్శులు పాల్గొన్నారు.



ఎస్సీ వెల్ఫేర్ అసోసియేషన్ క్యాలెండర్ ఆవిష్కరిస్తున్న ఎమ్మెల్యే లక్ష్మారెడ్డి

ఎస్సీ వెల్ఫేర్ అసోసియేషన్ క్యాలెండర్ ఆవిష్కరణ

మిర్యాలగూడ: తెలంగాణ స్టేట్ ఎస్సీ వెల్ఫేర్ అసోసియేషన్ డైరీ, క్యాలెండర్‌ను బుధవారం ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో ఎమ్మెల్యే బత్తుల లక్ష్మారెడ్డి ఆవిష్కరించారు. ఈ సందర్భంగా అంబేద్కర్ చిత్రపటానికి నివాళులర్పించారు.

రాజకీయాలకతీతంగా అభివృద్ధి చేస్తా

- ఎమ్మెల్యే కుందూరు జైవీర్‌రెడ్డి

నాగార్జునసాగర్: నందికొండ మున్సిపాలిటీని రాజకీయాలకతీతంగా అభివృద్ధి చేస్తానని ఎమ్మెల్యే కుందూరు జైవీర్‌రెడ్డి అన్నారు. నందికొండ మున్సిపాలిటీలోని కౌన్సిలర్ల పదవీ కాలం ఈనెల 26న పూర్తి కావడంతో బుధవారం మున్సిపాలిటీ కార్యాలయంలో కమిషనర్ శ్రీనివాస్ అధ్యక్షతన ఆత్మీయ వీడ్కోలు సమావేశం నిర్వహించారు. ఈసందర్భంగా వారిని సన్మానించారు. అనంతరం ఎమ్మెల్యే మాట్లాడుతూ.. గత ఐదు సంవత్సరాల కాలంలో కౌన్సిలర్లు ప్రజలకు అందుబాటులో ఉండి కొంతమేరకు అభివృద్ధి చేశారని తెలిపారు. మిగిలిన అసంపూర్తి పనులన్నింటినీ పూర్తి చేస్తానన్నారు. జెడ్పీ మాజీ వైస్ చైర్మన్ కర్నాటి లింగారెడ్డి మాట్లాడుతూ.. నందికొండ కాలనీలో 600మేర ఇళ్లు, 58, 59 జీవోల్లో రిజిస్ట్రేషన్ అయ్యాయని, మిగిలిన మరో 600పైచిలుకు ఇళ్ల రిజిస్ట్రేషన్ చేయాల్సి ఉందన్నారు. దరఖాస్తు పెట్టుకున్న వారందరికీ ఇళ్ల రిజిస్ట్రేషన్ అయ్యేలా ఎమ్మెల్యే, ముఖ్యమంత్రితో మాట్లాడాడని తెలిపారు. సమావేశంలో చైర్‌పర్సన్ అన్నపూర్ణ, కౌన్సిలర్లు మంగ్తా నాయక్, రమేశ్‌జీ, రామకృష్ణ, ఆదాసు నాగమణి, నిమ్మల ఇందిర, మోహన్‌రావు, మందాకుమార్ రఘువీర్(బిన్ని)డేగల నాగశిరీష పాల్గొన్నారు.

ఆదర్శ మున్సిపాలిటీగా తీర్చిదిద్దుతా

హాలియా: హాలియాను ఆదర్శ మున్సిపాలిటీగా తీర్చిదిద్దుతానని ఎమ్మెల్యే కుందూరు జైవీర్‌రెడ్డి అన్నారు. హాలియా మున్సిపల్ కార్యవర్గం పదవీకాలం ముగిసిన నేపథ్యంలో బుధవారం మున్సిపాలిటీ కార్యాలయంలో ఆత్మీయ వీడ్కోలు సమావేశం నిర్వహించారు.

ఈ సందర్భంగా మున్సిపల్ చైర్‌పర్సన్ యడవెల్లి అనుపమ, వైస్ చైర్‌పర్సన్ పిల్లి చంద్రకళ, వార్డు కౌన్సిలర్లను సన్మానించారు. అనంతరం ఎమ్మెల్యే మాట్లాడుతూ.. హాలియా మున్సిపాలిటీగా ఏర్పడడంతో అనుముల, ఇబ్రహీంపేట విలీన గ్రామాల కూలీలకు ఉపాధి హామీ పనులు లేకుండా పోయాయని, వారికి పనులు కల్పించేందుకు తనవంతుగా చర్యలు తీసుకుంటానన్నారు. కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ రామదుర్గారెడ్డి, హాలియా వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ తుమ్మలపల్లి చంద్రశేఖర్‌రెడ్డి, కాంగ్రెస్ సీనియర్ నాయకులు కాకునూరి నారాయణ గౌడ్, యడవెల్లి నరేందర్ రెడ్డి, కౌన్సిలర్లు చింతల చంద్రారెడ్డి, వర్ర వెంకట్ రెడ్డి, ప్రసాద్‌నాయక్, నల్లబోతు వెంకటయ్య, అన్నెపాక శ్రీనివాస్, గౌనీ సుధారాణి రాజా రమేష్ యాదవ్, చింతల దీప్తి, యల్లమ్మ పాల్గొన్నారు.



నందికొండ మున్సిపల్ పాలకవర్గాన్ని సన్మానిస్తున్న ఎమ్మెల్యే జైవీర్‌రెడ్డి



సన్మానం పొందిన హాలియా మున్సిపాలిటీ పాలకవర్గంతో ఎమ్మెల్యే కుందూరు జైవీర్‌రెడ్డి

చేతి వృత్తిదారుల కోసమే విశ్వకర్మ పథకం అమలు



వెంకటాద్రిపాలెంలో పనిముట్లు పంపిణీ చేస్తున్న బీజేపీ నాయకులు

మిర్యాలగూడ టౌన్: పేద, మధ్య తరగతి కుటుంబాల్లోని చేతి వృత్తిదారులకు చేయూతనిచ్చేందుకు ప్రధాన మంత్రి నరేంద్రమోదీ విశ్వకర్మ యోజన పథకం అమలు చేస్తోందని ఆ పథకం అసెంబ్లీ నియోజకవర్గ కన్వీనర్ చిలుకూరి శ్యాం, బీజేపీ మాజీ మండల అధ్యక్షుడు అంబటి కరుణాకర్‌రెడ్డి అన్నారు. బుధవారం మిర్యాలగూడ మండలం వెంకటాద్రిపాలెం, తుంగపాడు గ్రామాల్లో విశ్వకర్మ పథకం కింద శిక్షణ పొందిన లబ్ధిదారులకు పనిముట్లు పంపిణీ చేసి మాట్లాడారు. కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం పేదల కోసం అనేక సంక్షేమ పథకాలను అమలు చేస్తున్నందున వాటిని సద్వినియోగం చేసుకోవాలన్నారు. కార్యక్రమంలో మాజీ ఉప సర్పంచ్ దాసరాజు నరేష్, చెన్నూరి నర్సిరెడ్డి, ఫణీందర్‌రెడ్డి, శ్రీనివాస్, కిశోర్ తదితరులు పాల్గొన్నారు.

వేతనాలు చెల్లించకుంటే సమ్మె చేస్తాం



తిరుమలగిరి: ఎంపీడీఓ మల్లీశ్వర్‌కు వినతిపత్రం అందజేస్తున్న ఉపాధి హామీ సిబ్బంది



మిర్యాలగూడ: ఎంపీడీఓ కార్యాలయంలో వినతిపత్రం అందజేస్తున్న ఉపాధి హామీ సిబ్బంది

తిరుమలగిరి(నాగార్జున సాగర్): ఉపాధి హామీ ఉద్యోగులకు ప్రభుత్వం మూడు నెలలుగా వేతనాలు అందించకపోవడంతో ఆర్థికంగా ఇబ్బందులు పడుతున్నామని, వెంటనే వేతనాలు చెల్లించాలని ఎంపీడీఓ మల్లీశ్వర్‌కు బుధవారం వినతిపత్రం అందజేశారు. అడ్మిన్ బిల్లులు కూడా పెండింగ్‌లోనే ఉన్నాయని వాటిని కూడా చెల్లించాలన్నారు. ప్రభుత్వం తమ వేతనాలు చెల్లించకపోతే సమ్మె చేస్తామని హెచ్చరించారు. వినతిపత్రం అందజేసిన వారిలో ఏపీఓ శ్రీనయ్య, ఈసీ శ్రీరాములు, టెక్నికల్ అసిస్టెంట్లు బాలాజీ, సైదులు, కార్తీక్‌రెడ్డి, చంద్రశేఖర్, జ్యోతి, ఫీల్డ్ అసిస్టెంట్లు పాల్గొన్నారు.

వేతనాలు చెల్లించాలని వినతి

మిర్యాలగూడ: మూడు నెలలుగా వేతనాలు అందకపోవడంతో ఆర్థికంగా ఇబ్బందులు పడుతున్నామని ప్రభుత్వం వెంటనే వేతనాలు అందించాలని కోరుతూ ఉపాధి హామీ సిబ్బంది బుధవారం దామరచర్ల ఎంపీడీఓ కార్యాలయంలో వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన పథకాల అమలు కోసం పండుగలు, సెలవులు లేకుండా కష్టపడ్డామని, అయినా తమకు మూడు నెలలుగా వేతనాలు అందించకపోవడంతో ఇల్లు గడవడం కష్టంగా మారిందన్నారు. ఇప్పటికైనా ప్రభుత్వం తమ ఇబ్బందులను గుర్తించి వేతనాలు సకాలంలో అందించాలని కోరారు. వినతిపత్రం అందజేసిన వారిలో పద్మ, వెంకటలక్ష్మి, కృష్ణవేణి, నాగమణి, సావిత్రి తదితరులు పాల్గొన్నారు.



అడవిదేవులపల్లి ఎంపీడీఓ కార్యాలయంలో వినతిపత్రం అందజేస్తున్న ఉపాధి హామీ సిబ్బంది

ఎంపీడీఓకు వినతి

అడవిదేవులపల్లి: మహాత్మాగాంధీ జాతీయ ఉపాధి హామీ పథకంలో పని చేస్తున్న ఉద్యోగులకు వేతనాలు చెల్లించాలని బుధవారం ఎంపీడీఓ కార్యాలయ సూపరింటెండెంట్ అమీర్ అలీకి వినతిపత్రం అందజేశారు. వారిలో ఏపీఓ సూరానాయక్, రాధ, జానకి, చిన్నా, నాగరాజు తదితరులున్నారు.

వచ్చే నెల 3న శ్రీవేంకటేశ్వర స్వామి కల్యాణోత్సవం

మిర్యాలగూడ: మండలంలోని అవంతీపురం గ్రామంలో గల శ్రీదేవి భూదేవి సమేత శ్రీకల్యాణ వేంకటేశ్వరస్వామి వార్షిక శాంతి కల్యాణాన్ని ఫిబ్రవరి 3న నిర్వహించనున్నట్లు ఆలయ కమిటీ సభ్యులు బుధవారం తెలిపారు. భక్తులు అధిక సంఖ్యలో హాజరై ఉత్సవాలను విజయవంతం చేయాలని కోరారు.

అంగన్‌వాడీ కేంద్రాల పరిశీలన



రుద్రారం గ్రామంలో అంగన్‌వాడీ కేంద్రాన్ని పరిశీలిస్తున్న సీడీపీఓ మమత

మిర్యాలగూడ టౌన్: సమగ్ర శిశు సంక్షేమ శాఖ రాష్ట్ర డైరెక్టర్ ఆదేశాల మేరకు మిర్యాలగూడ పట్టణంతో పాటు మండలంలోని పలు అంగన్‌వాడీ కేంద్రాల భవనాలను బుధవారం మిర్యాలగూడ అర్బన్ సీడీపీఓ రేఖల మమత సందర్శించారు. ఈ సందర్భంగా విద్యార్థుల వివరాలతో పాటు కేంద్రాల్లోని అన్ని గదులు పరిశీలించారు. ఆమె మాట్లాడుతూ.. మిర్యాలగూడ ఐసీడీఎస్ ప్రాజెక్టు పరిధిలోని పట్టణంలో 100, రూరల్‌లో 111 అంగన్‌వాడీ కేంద్రాలను పరిశీలించినట్లు చెప్పారు. ఆమె వెంట ఐసీడీఎస్ సూపర్‌వైజర్లు రాధిక, నజిమా, వాణి, హేమ, లీలాకుమారీ, పద్మ, సుశీల తదితరులున్నారు.

రైతులకు అందుబాటులో యూరియా



పీఏసీఎస్‌లో యూరియా స్టాక్‌ను పరిశీలిస్తున్న ఏఓ సైదానాయక్

మిర్యాలగూడ: రైతులు యూరియా కోసం ఇబ్బందులు పడాల్సిన అవసరం లేదని, దగ్గర్లోని సహకార కేంద్రాలకు వెళ్లి యూరియా కొనుగోలు చేసుకోవచ్చని ఏఓ సైదానాయక్ తెలిపారు. బుధవారం మిర్యాలగూడ పట్టణంలోని పీఏసీఎస్, డీసీఎంఎస్ కేంద్రాలను ఆయన సందర్శించి యూరియా నిల్వలు పరిశీలించారు. ప్రైవేట్ ఫర్టిలైజర్ దుకాణాదారులు యూరియాను ఎమ్మార్పీ ధర కంటే అధికంగా అమ్మితే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

ప్రభుత్వ భూమిలో ఉన్న ఇళ్ల కూల్చివేత



నిడమనూరులో రెవెన్యూ అధికారులు కూల్చివేసిన ఇళ్లు



తహసీల్దార్ కార్యాలయం ఎదుట నిరసన తెలుపుతున్న బాధితులు

- తహసీల్దార్ కార్యాలయం ఎదుట బాధితుల ధర్నా

త్రిపురారం: నిడమనూరు మండల కేంద్రంలోని సివిల్ జూనియర్ కోర్టుకు సమీపంలో ఉన్న ఎన్నెస్పీ ప్రభుత్వ భూమిలో గత 40 ఏళ్లుగా స్థిర నివాసం ఏర్పాటు చేసుకున్న ఉప్పునూరి సాంబయ్య, గన్నెపల్లి కోటమ్మ, నాగిళ్ల ఎల్లమ్మ ఇళ్లను రెవెన్యూ అధికారులు బుధవారం కూల్చివేశారు. ఎలాంటి నోటీసులు లేకుండా అధికారులు తమ ఇళ్లను కూల్చి వేయడంతో రోడ్డున పడ్డామని నిడమనూరు తహసీల్దార్ కార్యాలయం ఎదుట బాధితులు తమ ఇంటి సామన్లతో నిరసన తెలిపారు. పలు కుల సంఘాల సభ్యులు వారికి మద్దతు తెలిపారు. ప్రభుత్వ భూమిలో ఇళ్లను నిర్మించుకున్న వారికి ముందుగానే నోటీసులు ఇచ్చామని, ఇందిరమ్మ ఇళ్లు ఇవ్వడానికి కూడా ప్రతిపాదించామని, నిబంధనలు అతిక్రమించడంతో ప్రభుత్వ స్థలాన్ని స్వాధీనం చేసుకోవడానికి కూల్చివేతలు చేపట్టామని రెవెన్యూ అధికారులు పేర్కొన్నారు.

నేడు విద్యుత్ సరఫరా నిలిపివేత

గుర్రంపోడు: గుర్రంపోడు మండలంలో దామరచర్ల నుంచి చౌటుప్పల్ వరకు 400 కేవీ నూతన టవర్ లైన్ ఏర్పాటు చేస్తున్నందున గురువారం పలు గ్రామాల్లో విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్లు విద్యుత్ ఏఈ శ్రీకాంత్ రెడ్డి తెలిపారు. లక్ష్మీదేవిగూడెం, తుర్కోనిబావి గ్రామాల్లో ఉదయం 8 గంటల నుంచి సాయంత్రం విద్యుత్ సరఫరా పూర్తిగా నిలిపివేయబడుతుందని పేర్కొన్నారు. గుర్రంపోడు, పోచంపల్లి, పిట్టలగూడెం, కొప్పోలు 33 కేవీ విద్యుత్ సబ్‌స్టేషన్ల పరిధిలో కొన్ని గ్రామాలకు రోజులో నాలుగు గంటల పాటు సరఫరా నిలిపివేయనున్నట్లు తెలిపారు. తిరిగి సాయంత్రం 5 గంటల నుంచి 9 గంటల వరకు త్రీఫేజ్ సరఫరా అందిస్తామని పేర్కొన్నారు.

ఆర్టీసీకి ప్రయాణికుల భద్రత ముఖ్యం

రామగిరి(నల్లగొండ): ప్రయాణికుల భద్రత ఆర్టీసీకి ఎంతో ముఖ్యమని రెడ్‌క్రాస్ జిల్లా చైర్మన్ గోలి అమరేందర్‌రెడ్డి అన్నారు. జాతీయ రోడ్డు భద్రతా వారోత్సవాల్లో భాగంగా బుధవారం నల్లగొండ ఆర్టీసీ బస్టాండ్ ఆవరణలో మెగా రక్తదాన శిబిరం ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమంలో ఆయన పాల్గొని మాట్లాడుతూ అత్యవసర సమయాల్లో రక్తం అందక అనేకమంది ప్రాణాలు కోల్పోతున్నారని అన్నారు. ఈ శిబిరం ద్వారా 105 యూనిట్ల రక్తాన్ని సేకరించామని తెలిపారు. ఆర్టీసీ ఆర్ఎం కె.జానిరెడ్డి మాట్లాడుతూ ఆర్టీసీ ఉద్యోగులు రక్తదానం చేయడానికి ముందుకు రావడం అభినందనీయమన్నారు. ఉమ్మడి జిల్లా నుంచి 7 డిపోలకు చెందిన ఉద్యోగులు రక్తదానం చేశారన్నారు. కార్యక్రమంలో డిప్యూటీ ఆర్ఎంలు మాధవి, శివశంకర్, డిపో మేనేజర్ శ్రీనాథ్, ఎన్నమల్ల అంజయ్య, నేతి విప్లవకుమార్, సద్దాం హుస్సేన్, రెడ్‌క్రాస్ సిబ్బంది సీవీ రాములు, ఆర్టీసీ సిబ్బంది పాల్గొన్నారు.



రక్తదానం చేస్తున్న ఆర్టీసీ ఉద్యోగులు

లబ్ధిదారులకు ఇళ్లు ఇవ్వాలి



మాట్లాడుతున్న సలీం

నల్లగొండ టౌన్: నల్లగొండలో నిర్మించిన 552 ఇళ్లను లాటరీ ద్వారా ఎంపిక చేసిన లబ్ధిదారులకు ఇవ్వాలని సీపీఎం జిల్లా కమిటీ సభ్యుడు ఎండీ సలీం డిమాండ్ చేశారు. బుధవారం దొడ్డి కొమురయ్య భవన్‌లో ఏర్పాటు చేసిన డబుల్ బెడ్ రూమ్ ఇళ్ల లబ్ధిదారుల జనరల్ బాడీ సమావేశంలో ఆయన మాట్లాడారు. డబుల్ బెడ్ రూమ్ సాధన పోరాట కమిటీ ఆధ్వర్యంలో కలెక్టర్‌కు వినతి పత్రాలు ఇచ్చినా, ఆందోళన చేసినా స్పందించడం లేదన్నారు. ఈ సమావేశంలో సీపీఎం పట్టణ కార్యదర్శి దండంపెల్లి సత్తయ్య, ఐద్వా జిల్లా ఉపాధ్యక్షురాలు తుమ్మల పద్మ, అవుట రవీందర్ , ఊట్కూరు మధుసూదన్ రెడ్డి, నాగరాజు, వెంకటయ్య, ఎస్‌కే లతీఫ్, సుల్తాన్, ఫాతిమా బేగం, గౌసియా బేగం, నగీన, రజని పాల్గొన్నారు.

డ్రగ్స్ నిర్మూలనపై అవగాహన

నల్లగొండ: నల్లగొండ పట్టణంలోని కోమటిరెడ్డి ప్రతీక్‌రెడ్డి మెమోరియల్ జూనియర్, ఒకేషనల్ కళాశాలల్లో బుధవారం యాంటి డ్రగ్ అవేర్‌నెస్ కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమానికి ఆర్ఎస్‌సీ నల్లగొండ, సూర్యాపేట తెలంగాణ యాంటి నార్కోటిక్స్ బ్యూరో డీఎస్పీ పి.భిక్షపతిరావు ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎక్కడైనా డ్రగ్స్ వినియోగించినా, రవాణా సమాచారం తెలిసినా టోల్ ఫ్రీ నంబర్ 1908కి ఫోన్ చేసి సమాచారం ఇవ్వాలని తెలిపారు. అనంతరం డ్రగ్స్ నిర్మూలనపై రూపొందించిన పోస్టర్‌ను విడుదల చేశారు. కార్యక్రమంలో కాలేజీ ప్రిన్సిపాల్ మేరుగు రాకేంద్, ఒకేషనల్ కళాశాల ప్రిన్సిపాల్ టి.నర్సింహ, వన్‌టౌన్ ఎస్ఐ శంకర్, వైస్ ప్రిన్సిపాల్, లెక్చరర్లు, విద్యార్థులు పాల్గొన్నారు.



యాంటి డ్రగ్ అవేర్‌నెస్ కార్యక్రమానికి హాజరైన విద్యార్థులు